క్లుప్తంగా

రోడ్డు పక్క చెత్త తొలగింపు



చెత్త తరలింపు పనులు చేయిస్తున్న ఈఓపీఆర్డీ సుగుణాకరరావు

సాక్షి ఎఫెక్ట్...

గజపతినగరం: మరుపల్లి నుంచి మండల కేంద్రం గజపతినగరం వైపు వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్త కుప్ప ల తొలగింపు పనులను అధికారులు ప్రారంభించారు. 'రోడ్డు పక్కనే చెత్త' అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురిత మైన వార్తకు అధికారులు స్పందించారు. ఈఓపీఆర్డీ సుగుణాకరరావు పారిశుద్ధ్య కార్మికులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను ట్రాక్టర్‌కు ఎక్కించి దూరంగా తరలించారు. అలాగే పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపడుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక



సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న గార తవుడు

గజపతినగరం రూరల్: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పంచాయతీరాజ్ అసోసియేషన్ ప్రాంతీయ అధ్యక్షుడిగా నియమితులైన గజపతినగరం జెడ్పీటీసీ సభ్యు డు గార తవుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, పార్టీ పెద్దలు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గజపతినగరం: భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశానికి అందించిన సేవలు మరువలేనివని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడుచుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ రెడ్డి పావని అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్క రించుకుని మదుపాడ గ్రామంలో సోమవారం ఆయన చిత్రపటానికి పావని, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ సరిది దుర్గారావు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.భాస్కర్, నేతలు దొగ్గ దేవుడుబాబు, తవిటి నాయుడు, మహేష్, రామకృష్ణ, ఈశ్వరరావు,తదితరులుపాల్గొన్నారు.

పరామర్శ



జోగులు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యనారాయణ రాజు

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజుపేటలో టొంపల నారాయణరావు, బంకపల్లి జోగులు, గిడిజాల పాపారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు సోమవారం పరామర్శించారు. మృతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయా కుటుంబాలను పరామర్శించిన వారిలో వైస్ సర్పంచ్ గుంటమాని గోవింద్ , వైఎస్సార్‌సీపీ నేత రాజారావు ఉన్నారు.

రెండు బుట్టల విధానం మేలు

విజయనగరం: చెత్త సేకరణలో రెండు బుట్టల విధానం పాటించాల్సిందేనని నగరపంచాయతీ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్యటించిన ఆయన.. పలువురితో మాట్లాడి సమయానికి చెత్త తరలిస్తున్న వాహనాలు వస్తున్నాయా అని ఆరాతీశారు. అనంతరం స్థానికులకు పలు సూచనలు చేశారు. తడి,పొడి చెత్తలను వేర్వేరు డబ్బాల్లో వేసి పారిశుద్ధ్య సిబ్బంది అందజేయాలని తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్‌కు వెళ్లి, అక్కడ ప్రజలకు అందిస్తున్న ఆహారంపై ప్రజాభిప్రాయం సేకరించారు.

శక్తి సదన్ సందర్శన

విజయనగరం ఫోర్ట్: నగరంలోని వీటీ అగ్రహారం బీసీ కాలనీలో ఉన్న మహిళా ప్రాంగణంలోని శక్తి సదన్ భవనాన్ని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి సోమవారం సందర్శించారు. అక్కడి మహిళలతో మాట్లాడి, ఏవైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని అడిగారు.

నిలిచిన ఉపాధి పనులు..!

- గంట్యాడ మండలంలో సగానికి పైగా గ్రామాల్లో నిలిచిన పనులు
- మండలంలో పంచాయతీల సంఖ్య: 36
- పనులు జరుగుతున్న పంచాయతీలు 8 నుంచి 10 లోపే..

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను నెల రోజుల క్రితమే నిలిపివేశారు. దీంతో ఉపాధి వేతనదారులు పనులు లేక ఇంటికే పరిమితమయ్యారు. లక్కిడాం గ్రామంలో కూడా రెండు వారాల క్రితం పనులు నిలిచిపోవడంతో వేతనదారులు ఖాళీగా ఉంటున్నారు. ఈరెండు గ్రామా ల్లోనే కాదు. మండలంలోని అధికశాతం గ్రామాల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయి. చేసేది లేక కొంతమంది సిమెంట్, ఇటుక బట్టీలు వంటి పనులకు వెళుతున్నారు. మరి కొంతమంది విజయనగరం, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు పనుల కోసం వెళ్లాల్సి వస్తోంది. అడిగిన వారందరికీ పని కల్పిస్తాం అంటూ ఉపాధి హామీ అధికారులు ప్రకటనలు ఇస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటుంది. ఎన్నిసార్లు అడిగినా పని కల్పించడం లేదని పలు గ్రామాల్లో వేతనదారులు ఆరోపిస్తున్నారు. పనులు చేయడానికి అవకాశం ఉన్నప్పటికీ



మండలంలోని సిరిపురంలో పనులు చేస్తున్న వేతనదారులు

అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి.

సగం రోజులు కూడా పని కల్పించని వైనం

మండలంలో 36 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కేవలం 8 నుంచి 10 పంచాయతీల్లోనే ఉపాధి పనులు జరుగుతున్నట్టు సమాచారం. ఉపాధి హామీ పథకం చట్టం ప్రకారం జాబ్‌కార్డు ఉన్న వారికి వందరోజులు పని కల్పించాల్సి ఉన్నప్పటికీ మండలంలో చాలా గ్రామాల ప్రజలకు అధికారులు సగం రోజులు కూడా పనికల్పించ లేకపోయారు. రోజుకు సగటున 15 వేల వరకు వేతనదారులు పనులకు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం 5వేలు లోపే హాజరవుతున్నట్టు తెలుస్తోంది.ఉపాధి సిబ్బంది కొన్ని గ్రామాల్లో కావాలనే పనులు నిలిపివేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పనులు ఎందుకు జరగడం లేదన్నది కూడా ఉపాధి అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని వేతనదారులు మండిపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో 30 నుంచి 40 రోజులే పనికల్పించగా, మరికొన్ని గ్రామాల్లో కేవలం 15 నుంచి 20 రోజులే పని కల్పించారంటే ఉపాధి హామీ పథకం అమలు తీరు ఎలా ఉందో అర్థం కాక మానదు.

విచారణ చేపడతాం..

> ఉపాధి పనులు నిలిపివేయాలని ఏ ఫీల్డ్ అసిస్టెంట్‌కు చెప్పలేదు. కొన్ని గ్రామాల్లో పనులు చేయడానికి అవకాశం లేదని చెప్పి కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు నిలిపివేశారు. మిగతా చోట ఎందుకు పనులు జరగడం లేదో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
> – గర్బాపు సుందరరావు, ఏపీఓ, గంట్యాడ

పాఠశాలను మార్చేందుకు ప్రతిపాదన



జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు వడ్డన చేస్తున్న డిప్యూటీ డీఈఓ కేవీ రమణ



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్...

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం ప్రాథమిక పాఠశాలను డిప్యూటీ డీఈఓ కేవీ రమణ, ఎంఈఓ -2 బండారు శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో పాఠశాల దుస్థితిపై సాక్షి పత్రికలో ఈ నెల 20న 'దయనీయ స్థితిలో ప్రభుత్వ పాఠశాల' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ-2 పాఠశాలను సందర్శించి, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఒకటి, రెండు రోజుల్లో పాఠశాలను సచివాలయంలోకి మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కొత్తవలస మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు గోవిందనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు లీకులు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని మేదరవీధిలో తాగునీటి పైపు లైనుకు లీకులు కావడంతో తాగునీరు రోడ్డు మీదుగా వృథాగా పోతోంది. ఆరు నెలలుగా ఈ సమస్య ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. పైపులైన్ లీకుల వల్ల కుళాయిల ద్వారా తాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని, నీరు కలుషితమవుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. సమస్యను స్థానిక పంచాయతీ కార్యదర్శి జనార్దన్ వద్ద సాక్షి ప్రస్తావించగా వెంకటేశ్వరస్వామి కోవెల దగ్గరలో మూడు అడుగుల లోతు వరకు మెయిన్ పైపు



గజపతినగరంలోని మేదరవీధిలో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

లైన్ తవ్వి చూశామని, అక్కడ లీకులు కనిపించలేదని చెప్పారు. త్వరలోనే లీకులను గుర్తించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

విశాఖ డెయిరీ పాలసంఘ అధ్యక్షుడిగా ఈశ్వరరావు



ఈశ్వరరావు

కొత్తవలస: మండలంలోని పాతసుంకర పాలెం గ్రామానికి చెందిన పెదిరెడ్ల ఈశ్వరరావు విశాఖ డెయిరీ పాలసంఘ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మెంబర్లుగా లెంక దేవుడు, బెహరా వెంకటలక్ష్మి ఎన్నికైనట్లు వేతన కార్యదర్శి గవర అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరి పదవీ కాలం ఏడాది ఉంటుందని పేర్కొన్నారు.

నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలి

దత్తిరాజేరు: గ్రామాల్లో నీటి తీరువా వసూళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ విజయ భాస్కర్ వీఆర్‌ఓలను ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మండలంలోని వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వీఆర్‌ఓలు అంతా రోజూ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. నీటి తీరువా వసూళ్లకు సంబంధించిన డిమాండ్ నోటీసులు రైతులకు అందించి, డబ్బులను సచివాలయాల్లో చెల్లించే విధంగా చూడాలని సూచించారు. ఈనెలాఖరుకు 90 శాతం వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుర్ల: మండలంలోని అచ్చుతాపురం ఫీడర్ పరిధిలోని తెట్టంగి. పాలాయవలస, తాతావారి కిట్టాలి, పెనుబర్తి, అచ్చుతాపురం, చింతపల్లి పేట, గంగిరెడ్లపేటకు మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు మండల ఎలక్ట్రికల్ ఏఈ నారంనాయుడు సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

జామి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. అప్పలనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందం తనిఖీలు నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికపై బహిరంగ చర్చ నిర్వహిస్తామని, పాలకులు, అధికారులు, ప్రజలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

చేతికందేంత ఎత్తులో విద్యుత్‌తీగలు



చేతికందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను చూపిస్తున్న గ్రామస్తులు

మెరకముడిదాం: మండలంలోని పెదమంత్రిపేట గ్రామంలో విద్యుత్ వైర్లు చేతికందేంత ఎత్తులో ఉండడంతో ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ వైర్లను సరిచేయాలని విద్యుత్ శాఖాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదం సంభవించకముందే విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరారు.

మా భూములు మాకు ఇప్పించండి..



గ్రీవెన్స్‌కు వెళ్తున్న జిందాల్ నిర్వాసితులు

- జిందాల్ నిర్వాసితుల వినతి

శృంగవరపుకోట: గ్రామానికి కంపెనీ వస్తుందంటే మా బతుకులు బాగుపడతాయని ఆశ పడి 18 సంవత్సరాల కిందట భూములు ఇచ్చాం.. మా భూముల్లో కంపెనీలు పెట్టకుండా వ్యాపారాలు చేస్తుంటే, పేదల పక్షం వహించాల్సిన అధికారులతా జిందాల్‌కు కొమ్ము కాయడం న్యాయం కాదని.. మా భూములు మాకు అప్పగిస్తే వ్యవసాయం చేసుకుంటామని జిందాల్ నిర్వాసితులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను సోమవారం కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. 2013 భూహక్కు చట్టం ప్రకారం ఆరేళ్ల సమయంలో పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే భూములు తిరిగి రైతులకు అప్పగించాలన్నారు. అయితే 18 ఏళ్లు దాటుతున్నా జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కాలేదని... అధికారులు మాత్రం ఇంతవరకు భూములు అప్పగించలేదని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

• వరి విత్తనాల పంపిణీ



రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ వెంకటరావు

వేపాడ: మండలంలో శింగరాయిలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు రైతులకు సోమవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. రైతుసేవా కేంద్రం వద్ద వీఏఏ కె. కోమలత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు 1121, సాంబమసూరి, స్వర్ణ, తదితర రకాల విత్తనాలను సబ్సిడీపై అందజేశారు. కార్యక్రమంలో దుల్ల వెంకటరమణ, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

శింగరాయిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు

వేపాడ: మండలంలోని శింగరాయిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 12 అడుగుల విగ్రహం నెలకొల్పారు. గ్రామంలోని జ్వాలా ప్రకాష్ అంబేడ్కర్ సంఘ సభ్యులు, మహిళల సహకారంతో సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు సొంత నిధులతో విగ్రహం ఏర్పాటు చేయగా.. సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే దేశపాలనకు ఆధారమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, తహసీల్దార్ జె.రాములమ్మ, మండల నేతలు గుమ్మడి భారతి, గొంప తులసి, శానాపతి గణేష్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ, కస్తూరి బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఐకేపీ ఏపీఎం సూర్యనారాయణ, ఏపీఓ ఆదిలక్ష్మి సీహెచ్‌ఓ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు సత్యవతి, పద్మ, కాకర భారతి, సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు రమణ, మహిళలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



శింగరాయిలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం

పంచాయతీ కార్యదర్శులకు బదిలీ

దత్తిరాజేరు: మండలంలో అయిదుగురు పంచాయతీ కార్యదర్శులకు బదిలీ అయ్యిందని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వంగర గ్రామ పంచాయతీ కార్యదర్శి అప్పారావు గజపతినగరం మండలం పాతబగ్గాం, గడసాం కార్యదర్శి శ్రీనివాసరావు తెర్లాం మండలం ,తాడేందొరవలస కార్యదర్శి భాషా మెరకముడిదాం మండలం,గుచ్చిమి కార్యదర్శి ఇమంది లక్ష్మి జామి మండలం, దాసరిపేట కార్యదర్శి ప్రసాద్ గజపతినగరం మండలంలోని గుడివాడకు బదిలీ అయ్యారు.వీరి స్థానంలో ఇతర మండలాల నుంచి బదిలీపై వచ్చిన వారు మంగళవారం విధుల్లో చేరుతారని పేర్కొన్నారు.

• నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో వాసవీ వనితలు

శృంగవరపుకోట: మండలంలో తెన్నుబొడ్డవర ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు వాసవీవనితా క్లబ్ సభ్యులు సోమవారం నోట్ పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ అధ్యక్షురాలు పి.కోటిరత్నం, కార్యదర్శి శైలజ, తదితరులు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని, ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఐ.అశోక్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొర్లాంలో..

గంట్యాడ: మండలంలోని కొర్లాం గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మండల వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని ఓ రైతును సన్మానించి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

గడ్డపార, గునపాం అందజేశారు. ఈసందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ సత్యం మాట్లాడుతూ వాసవీక్లబ్ ద్వారా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో క్లబ్ ఆర్‌సీపీ రాజు, ఐపీసీ సర్వదేముడు, క్లబ్ జిల్లా ఇన్‌చార్జ్‌లు లక్ష్మణ్‌రావు, భాస్కరరావు, గోనుగుంట్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పరిశ్రమలను అడ్డుకోవద్దు..



జిందాల్ నిర్వాసిత రైతులతో కలిసి మాట్లాడుతున్న లోక్‌సత్తా నేతలు బాబ్జీ, తదితరులు

శృంగవరపుకోట: జిందాల్ భూముల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటును అడ్డుకోవద్దని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. మండలంలోని అడ్డతీగ గ్రామంలో జిందాల్ నిర్వాసితులతో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ.. జిందాల్ నిర్వాసితులకు తప్పక న్యాయం కావాలని, భూసేకరణ సమయంలో జిందాల్ కంపెనీ ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేయాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ సమావేశమై రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లాకు కొత్త పరిశ్రమలు రాక.. ఉన్నవి మూతపడి యువతకి ఉపాధి లేకుండా పోతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో రూ.3,970 కోట్లతో 45 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 10 చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు తమ ఆందోళన విరమించి శాంతియుతంగా చర్చల్లో పాల్గొని డిమాండ్ల సాధనకు సహకరించాలన్నారు. గతంలో జిందాల్ చేసిన చెల్లింపుల్లో పలు అక్రమాలు జరిగాయని.. నాడు లోకాయుక్త, ఏసీబీలో పిటీషన్లు వేసి రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. నేటికీ కొందరు తమకు పరిహారం అందక ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి సమస్యలను ముందుగా పరిష్కరించుకోవాలని సూచించారు. పరిశ్రమల అవసరాన్ని ప్రజలు, రైతులు గుర్తించాలని కోరారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రధాన రాజకీయ పార్టీల నేతలు నిర్వాసితులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కన్వీనర్ కె.ప్రసాద్, పౌరవేదిక ఉపాధ్యక్షుడు పి.ప్రభాకరరావు, మోహన్, అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు అరుణ, సత్యనారాయణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వసతిగృహ భవనాలు



మూతపడిన చందులూరు బాలికల వసతి గృహం



మూతబడిన గంగుబూడి బాలుర వసతి గృహం

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు బాలికల వసతిగృహంతో పాటు గంగుబూడి సాంఘిక సంక్షేమ వసతిగృహం, లక్కవరపుకోట, కళ్లేపల్లి బీసీ వసతిగృహాలు 2014 - 19 కాలంలో వరుసగా మూతపడ్డాయి. ప్రస్తుతం ఈ భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. గతంలో వందలాది మంది విద్యార్థులతో కళకళలాడే ఈ భవనాలు నేడు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. అధికారులు స్పందించి ఈ భవనాలను వేరే శాఖలకు అప్పగించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

తహసీల్దారుకు వీఆర్‌ఏల సమ్మె నోటీస్



తహసీల్దారుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వీఆర్‌ఏలు

భోగాపురం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు రమణమ్మకు వీఆర్‌ఏలు సమ్మె నోటీసు సోమవారం అందజేశారు. ఆ సంఘ నాయకుడు చంద్రరావు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి జూలై 9వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో తాము పాల్గొంటున్నామని తెలిపారు. వీఆర్‌ఏలకు తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నట్లుగా టైమ్ స్కేల్ జీతాలు ఇవ్వాలని, డీఏను కూడా జీతంలో కలపాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీ పోస్టుల భర్తీలో వీఆర్‌ఏల పదోన్నతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోగా ఇసుక ర్యాంపులు, రైస్‌మిల్లుల వద్ద బలవంతంగా నైట్‌డ్యూటీలు చేయిస్తోందని ఆరోపించారు. కావాలనే అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం తమను వేధిస్తోందని మండిపడ్డారు. సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్త సమ్మెలో వీఆర్‌ఏలంతా పాల్గొనాలని కోరారు.